# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 16 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


నదిలో అమ్మవారికి ఒడి సమర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, పొన్నం, సురేఖ



# పుష్కరుడి ఆగమనం

## కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మొదటిరోజు పుష్కర స్నానాలు
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- త్రివేణి సంగమంలో సౌకర్యాలు లేక భక్తుల ఇబ్బందులు
- వీఐపీల సేవల్లో తరిస్తున్న అధికారులు
- ఆరంభం అంతంత మాత్రమే

మహదేవపూర్, మే 15 : గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా పిలువబడే సరస్వతీ నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.44 గంటలకు సరస్వతీ పుష్కరాలు వేద మంత్రోచ్చారణలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతీ నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరై పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి తొలి పూజలు చేసిన తర్వాత సరస్వతీ నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పణ చేశారు. శ్రీగురుమదానంద సరస్వతి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వేద పండితులు సరస్వతీ నదికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి, సరస్వతీ మాత ఆలయాలను ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు త్రివేణి సంగమం వద్ద సరస్వతీ మాతకు పూజలు చేసి పుణ్యస్నానాలాచరించారు. నదీ తీరం వద్ద పితృ తర్పణాలు, సంకల్ప పూజలు చేశారు.



గోదావరి ఒడ్డున ఆవిష్కరించిన సరస్వతీ మాత విగ్రహం



### పుష్కరస్నానం చేసిన రేవంత్‌రెడ్డి

సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరంలోని సరస్వతీ మాత విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి నదిలో పుణ్యస్నానం ఆచరించి గోదావరి హారతి తదితర పూజల్లో పాల్గొన్నారు.



నదీ మాతకు హారతి సమర్పిస్తున్న కాశీ పండితులు

### తొలిరోజు మందకొడిగా భక్తులు

రోజుకు రెండు లక్షల మంది భక్తులు పుష్కరాలకు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేసినా మొదటిరోజు మందకొడిగా వచ్చారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు సరిపడా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా చలువ పందిళ్లు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు ఎండకు విలవిలలాడారు. ఇంకా పది రకాల పనులు కొనసాగుతుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం వీఐపీ సేవలో తరించారు. భక్తులు మందకొడిగా రావడంతో వ్యాపారం జరగలేదని వ్యాపారులు నిరాశకు లోనయ్యారు. ఇదిలా ఉండగా పుష్కరాల్లో పూజలు నిర్వహించేందుకు ఆంధ్ర నుంచి సుమారు 600 మంది పూజారులు త్రివేణి సంగమానికి చేరుకున్నారు. ఇక్కడ పరిస్థితులు చూసి నివ్వెరపోయారు.

### సీఎంకు సొంత పార్టీ నేతల నిరసన సెగ..

సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద సీఎం రేవంత్ రెడ్డికి సొంత పార్టీ నేతల నుంచే నిరసన సెగ తగిలింది. ఫ్లెక్సీలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో ఎందుకు పెట్టలేదంటూ నినాదాలు చేశారు. దళిత ఎంపీ అంటే అంత చిన్నచూపా అంటూ రాసిన ప్లకార్డులను పట్టుకొని ఆందోళన చేశారు. దీంతో అక్కడున్న పోలీసులు వారిని ఈడ్చుకుంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



ఘాట్ వద్ద నిరసన తెలుపుతున్న చెన్నూరు కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



పుష్కరాలు ప్రారంభమైనా కొనసాగుతున్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ పనులు



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- అకాల వర్షాలతో ఆగమవుతున్న రైతులు
- రేవంత్‌రెడ్డి పాలనలో దివాలా తీసిన రాష్ట్రం
- మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకుతింటున్నారు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, మే 15 : ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, సెంటర్లలో వడ్లు కాంటాలు కాక రైతులు చనిపోతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరతతో ధాన్యం తరలింపు ఆలస్యమవుతున్నదని, పాలకుర్తి నియోజకవర్గంలోని చర్లపాలెం, పోచంపల్లి కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు వడదెబ్బతో మృతి చెందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీల మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని మండిపడ్డారు. గురువారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, అతడే స్వయంగా అప్పు పుట్టడం లేదని చెప్పడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ 16 నెలల పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఆన్యాయం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డివి బోగస్ మాటలు తప్ప అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక పక్క కాంటాలు కాకపోగా, మరోవైపు అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించలేదన్నారు. కల్లాల్లో రైతులు కన్నీళ్లు పెడుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ప్రభుత్వానికి సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే రైతుబంధు వేషాలు వేస్తున్నారన్నారు. సన్న వడ్లకు బోనస్ పడడం లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ వంద సీట్లు గెలవడం ఖాయమన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఎదురు లేదని, కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, రజతోత్సవ సభతో రాజకీయాల్లో మార్పు వచ్చిందని ఎర్రబెల్లి అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాంధీనాయక్, పార్టీ మండలాధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, జర్పుల బాలునాయక్, ధరావత్ యాకూబ్‌నాయక్, గుగ్గిళ్ల యాకయ్య, అల్లమనేని రమేశ్‌రావు, గర్వందుల మల్లేశ్, జోగు గోపి, బానోత్ మహేందర్, కడుదుల కరుణాకర్‌రెడ్డి, కత్తి సైదులు, వీరమనేని సోమేశ్వర్‌రావు, ఎండీ నాసర్, బొడిగె ప్రదీప్, దొంతమల్ల గణేశ్, లకావత్ వెంకట్, సురేశ్, జీ రాజు, బీ రవివర్మ, జీ శ్రీనివాస్, జీ రాఘవులు, గీ సమ్మయ్య, జీ ఆంజయ్య, జీ రాజు పాల్గొన్నారు.

### వీరవనితలు పుట్టిన నేలపై అవమానం



ములుగు రూరల్ : రాణీ రుద్రమదేవి, సమ్మక్క-సారలమ్మ లాంటి వీర వనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని విదేశీ మహిళల కాళ్ల దగ్గర కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టుపెట్టడం దారుణం. ఆడబిడ్డలతో సుందరీమణుల కాళ్లను అధికార యంత్రాంగం కడిగించింది. విదేశీ అందగత్తెల మెప్పు పొందేందుకు కాళ్లు కడగాలా?. ఈ ఘటన ద్వారా సభ్య సమాజం తలదించుకుంటున్నది. శివుడి సన్నిధిలో అభిషేకాలు జరగాలే కానీ అందాల భామల కాళ్లు కడిగి కాంగ్రెస్ పార్టీ రుద్రుడిని అవమానపరిచింది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెప్పి కాళ్లు కడిగిస్తారా?. కుర్చీల మీద కూర్చోబెట్టి ఇత్తడి తాంబాలంలో మినరల్ వాటర్‌తో శుభ్రం చేయడం, తువాలతో కాళ్లు తుడి పించడమేనా ఆత్మగౌరవం?. తెలంగాణ సంప్రదాయం అంటూ తప్పుని వెనుకేసుకొని రావడం సరికాదు. మంత్రి సీతక్కకు అందాల పోటీ మీద ఉన్న శ్రద్ధ రైతుల ధాన్యం కొనుగోలు మీద లేదు. కలాల్ల దగ్గర రైతులు ఏడుస్తూ ఉంటే వారిని పట్టించుకునే నాథుడు లేడు కానీ విదేశీ అందగత్తెల కోసం రూ. 200 కోట్లు ఖర్చు పెట్టడం క్షమించరాని విషయం. – బడే నాగజ్యోతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్

**ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని** అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాల దగ్గర పెట్టడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. 'విదేశీ యువతుల కాళ్లు కడిగించడం దారుణం. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెట్టింది. దీనికి మహిళా లోకం బాధపడుతున్నది. దీని ద్వారా సమాజానికి ఏం సంకేతం ఇచ్చారు?. సంప్రదాయమంటూ వెనకేసుకురావడం సరికాదు. వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి' అని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 15



# ఆత్మగౌరవం తాకట్టుపై ఆగ్రహం

## విదేశీ యువతుల కాళ్లు కడిగించడం దారుణం

### కాళ్లు కడగడం తెలంగాణకే అవమానం



ఏటూరునాగారం: ప్రపంచ సుందరీ పోటీదారుల కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించి టవల్స్‌తో తుడిపించడం ఆడపడుచులను అవమానపర్చడమే. అందాల భామల కాళ్లు కడిగి తుడవడం తెలంగాణ సంస్కృతిలో ఎక్కడైనా ఉందా?. ఇంటికి వచ్చిన అతిథికి కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు ఇవ్వడం ఇక్కడి ఆనవాయితీ మాత్రమేనని, కాళ్లు కడిగే పద్ధతి ఎక్కడ ఉంది. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి భంగం కలిగింది. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను గాలికి వదిలేసి అందాల పోటీలు నిర్వహించడం అవివేకం. తెలంగాణ ఆడపడుచులను అవమానిస్తే ఊరుకునేది లేదు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి పద్ధతులకు స్వస్తి పలకాలి.

– బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు

### ఈ ఆచారం ఎక్కడిది?

- సంప్రదాయమంటూ వెనకేసుకురావడం సరికాదు
- ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పాలని పలువురి డిమాండ్



ములుగురూరల్ : అతిథుల కాళ్లు కడిగే ఆచారం తెలంగాణలో ఎక్కడ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మ గౌరవానికి ఘోరమైన అవమానం చేసింది. వారం రోజుల నుండి రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీదారులు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రాంతాల్లో ఒకటైన రామప్ప దేవాలయానికి వారు వచ్చిన క్రమంలో అందగత్తెల కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం దారుణం. మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్ల వద్ద మన సంప్రదాయాన్ని ప్రభుత్వం తాకట్టు పెట్టింది. కాంగ్రెస్ అంటేనే గ్రేస్ పార్టీ. హిందువుల మనోభావాలను అవమానపర్చమే ప్రభుత్వ పని. విదేశీయుల కాళ్లు కడిగించడం ద్వారా ఈ సమాజానికి ఏం సంకేతం ఇచ్చారు. వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో వారితో బుద్ధి చెప్పిస్తాం.

– ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్

### కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి



జనగామ చౌరస్తా : ప్రపంచ సుందరీమణుల కాళ్లు కడిగించి తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ గౌరవం దెబ్బతీశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ బానిసత్వానికి, తెలంగాణ ప్రాంత మహిళలపై వారికున్న విద్వేషపూరిత భావానికి ఇది నిదర్శనం. అందాల పోటీల పేరుతో ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని మంటగలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి.

–కత్తుల లక్ష్మి, బీజేపీ మహిళా మోర్చా జనగామ జిల్లా అధ్యక్షురాలు



ఏటూరునాగారంలోని జీసీసీ కొనుగోలు కేంద్రంలో వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యం కుప్ప

**తరచూ కురుస్తున్న అకాల వర్షాలతో** కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసి మొలకెత్తుతున్నది. వడ్లపై టార్పాలిన్లు కప్పడం.. తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతూ.. తిరగల వేయడం రైతులకు ఇబ్బందిగా మారింది. లారీలు లోడింగ్‌కు రాకపోవడం, అధికారులు, మిల్లర్లు, సెంటర్ ఇన్‌చార్జిల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏటూరునాగారం, దంతాలపల్లి మండలాల్లో కొనుగోళ్ల జాప్యంతో ధాన్యం పేరుకుపోతున్నది. నష్టపోతున్న తమను ఆదుకోవాలని అన్నదాత వేడుకుంటున్నది.

– ఏటూరునాగారం/దంతాలపల్లి, మే 15

# మొలకెత్తిన వడ్లు.. రైతుల్లో దిగులు

- అకాల వర్షాలతో ఆగమాగం
- కొనుగోళ్ల జాప్యంతో పేరుకుపోతున్న వడ్లు
- బురదమయంగా కేంద్రాలు



దంతాలపల్లి: పెద్దముప్పారం కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం బస్తాలు

అకాల వర్షాలతో ఏటూరునాగారం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకెత్తడంతో రైతులు తిరగబోస్తూ ఆరబెట్టుకుంటున్నారు. నింపిన ధాన్యం బస్తాలు నీటిలో కొంత మేరకు మునక పట్టడంతో వాటిని సైతం తిరగల వేస్తున్నారు. వర్షాలతో దారులు బురదగా మారి కేంద్రాల్లోకి లారీలు లోడింగ్ వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక అయోమయంలో రైతన్న కొట్టుమిట్టాడుతున్నాడు. ఇక తరచూ కురుస్తున్న వర్షాలకు తాలు, ధాన్యం తడిసి కొన్ని కేంద్రాలు కంపు కొడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసుకోలేక ఓపిక నశించిన కొందరు రైతులు సీడ్ వ్యాపారులు, దళారులకు విక్రయించుకుంటున్నట్లు తెలుస్తోంది. మండలంలో జీసీసీ, పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గోగుపల్లిలో వాగు ఒడ్డు వెంట ఏర్పాటు చేసిన కేంద్రంలోకి వరద రావడంతో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇక్కడ నిల్వ చేసిన ధాన్యాన్ని కొందరు రైతులు ఇక గురువారం మరో చోటుకు తరలించి ఎండబెట్టుకున్నారు. సెంటర్స్ స్థలం ఎగుడు దిగుడుగా ఉండడంతో నీళ్లు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో నీటిని పంపించేందుకు జేసీబీలతో కాల్వలు తీసుకోవాల్సి వస్తున్నది. కేంద్రాలకు స్థలం లేకపోవడంతో రైతుల భూములకు ఎంతో కొంత చెల్లించి సెంటర్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షాలు పడడంతో తడిసిన బస్తాలను మిల్లులకు నేరుగా పంపిస్తున్నట్లు సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారు. అదేవిధంగా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాల్లో మొలకలు వచ్చాయి. కాగా, గోగుపల్లి వరదలో తడిసిన 20 మంది రైతులకు సంబంధించి రెండు లారీల లోడు ధాన్యాన్ని మిల్లులకు పంపించినట్లు డీటీ రాహుల్ తెలిపారు.



జీసీసీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని తిరగబోస్తున్న రైతు



మొలకలు వస్తున్న ధాన్యాన్ని చూపుతున్న రైతు



పీఏసీఎస్ కేంద్రంలో తిప్పి ఆరబెట్టిన తడిసిన బస్తాలు